5)

# 'లచ్చిమి'

పచ్చలయ్య ముసలిరైతు అతనికున్నదే రెండెకరాల మాగాణి. ఆ మాగాణి అతనికి మాలచ్చిమి. ఆ రెండెకరాలభూమి ఒక వ్యక్తిఅయింది. ఆ చిన్నారి పొలానికి "లచ్చిమి"అని పేరు పెట్టుకొన్నాడు. ఆ పొలంకూడా చాలా అందంగా ఉంటుంది. పంటకాల్వఒడ్డునే ఉంది. ఆ పొలం నవ్వనికాలం లేదు.

"లచ్చిమి" చుట్టు వెడల్పాటిగట్టు వేసినాడు. ఆ గట్టుపైన అంటుమామిడిచెట్లు నాల్గు, ఒక పాతమామిడిచెట్టు ఉన్నవి. పది అరటిబోదెలున్నాయి. కాల్వవైపుగట్టు కూరగాయలు పెంచేందుకు! ఆగట్టంతా ఏవో పాదు లెప్పుడూ పెరుగుతూ ఉంటాయి. వంగచెట్లు, తోటకూర, గోంగూర, కొత్తిమీరమళ్ళు ఘుమఘుమలాడుతూ, వేసవికాలంలో కూడా పచ్చగా మిలమిలలాడుతుంటాయి. పాదులలో విడవకుండా దొండ ఎప్పుడూ కాస్తూనే ఉంటుంది. తూర్పుగట్టుమీదనాల్గు సపోటాచెట్లు, పది తేనెబొప్పాయిచెట్లు, మల్లె, జాజి, గులాబి అంట్లూ ఉన్నాయి. పడమటిగట్టుమీద పొడుగునా గొబ్బరిచెట్లు గంభీరంగా ఆకాశంలోకి తలలాడిస్తూఉంటాయి.

తన కన్నకూతురే లచ్చిమి.

## 2

అతనికి పెళ్ళి లేదు. చిన్నతనంలో రంగం పారిపోయాడు. కొండంత బరువులెత్తి శేషుడై మూటడబ్బుగట్టాడు.

నాలుగు వేదాలూ ఒకేసారమై భూమి అనే రథాన్ని లాగినట్లు పచ్చలయ్య రిక్షాల్ని లాగి డబ్బు సంపాదించాడు.

మధుపానంకోసం, మానినీమణులకోసం పోగుచేసుకొనే చిల్లరమూటల్లోంచి డబ్బు ఖర్చు అయినా అసలే జాగ్రత్త మనిషి అవడంచేత పచ్చలయ్యకి యాభయ్యోయేడు వచ్చేటప్పటికి రెండువేల అయిదువందల యాభై మూడు రూపాయలు పోగయ్యాయి. కన్నతల్లిఅయిన తెలుగుదేశం పిలుపు వినబడింది.

రంగంపట్నవాసపు ఛండాలపుకంపులు అప్పటి కతనికి ఏవగింపు పుట్టించాయి. ఆంధ్రదేశంలో గోదావరిజిల్లాలో తన గ్రామం జ్ఞాపకంవచ్చింది. చిన్నతనంలో తన తండ్రి భూములు కవుళ్ళకు తీసుకుని వ్యవసాయంచేసిన రోజులు, తాను దూడల్నికాసిన రోజులు, మక్తాధాన్యం ఇవ్వలేక తండ్రిపడిన అగచాట్లు, భూమియజమాని తండ్రిని పెట్టిన కష్టాలు, తండ్రి బాకీదారుడై బాకీదారులజయిలుకి వెళ్ళడం, తన అక్కపెళ్ళికి తండ్రిపడిన ఇబ్బందులు, వానకాలపు మబ్బైకంటికి మంటికి ఏకధారై తల్లి కుళ్ళిపోయిన విషయం, తనకున్న ఆస్తి పాస్తి తాకట్టుపెట్టి తండ్రి డబ్బుతెచ్చినసంగతీ, తాను రంగానికి పారిపోవడం, తల్లిదండ్రులకు తాను వ్రాయించిన యుత్తరాలు, అప్పుడప్పుడు పంపించిన పదీ పాతికి, తండ్రికి అప్పిచ్చిన తణఖాదారుడు వ్యాజ్యమేసి, వేలంలో ఇల్లూ దొడ్డీ తనే పాడుకోడం, ఒకరి తరువాత ఒకరు తల్లీ తండ్రీ చనిపోవడం, ఇవన్నీ ఒక్కసారిగా తెరమీద బొమ్మల్లా అతని మనోనేత్రాల ఎదట ఆడిపోయాయి.

తాను పోగుచేసుకున్న డబ్బు సంగ్రహించుకొని పచ్చ లయ్య స్వగ్రామమైన ఉండీ అగ్రహారం చేరుకున్నాడు.

తొలకరివానలు కురిసి, బీటలుకట్టి యెండిఉన్న పొలాలు తడిసి, ఆ పొలాల్లోంచి వస్తూన్న సువాసన పచ్చ లయ్యకి హాయి సమకూర్చింది. పొలాలన్నీ ప్రాణాలున్న వ్యక్తులై పచ్చలయ్యకు ప్రత్యక్షమయ్యాయి. అతని అదృష్టం కొలది స్వగ్రామంలో కాలవగట్టున రెండెకరాలపొలం అమ్మ కానికి వచ్చింది. వెనక్కూ ముందుకూ సాగించి క్రిందామీదా పడి, పచ్చలయ్య ఆ భూమిని రెండువేలరెండువందలకు స్వాధీనం చేసుకున్నాడు. ఉండీ సబురిజిష్ట్రారుఆఫీసులో పత్రం రిజిష్టరుచేయించి మహాపట్టణమైన రంగాన్ని పరిపాలించిన పచ్చ లయ్య నూరురూపాయల కొక ఎద్దులజత, ఇరవైరూపాయల కొక నాగలి కొని వ్యవసాయం ప్రారంభించాడు. వ్యవసాయం అతనికి ఆనంద పూర్ణమైన తపస్సు అయినది. పొలం మరమ్మతు చేయించినాడు. పాటిమన్ను తోలించాడు. ఆ పొలం బాలికను తానుకన్న కూతుర్ని చేసుకున్నాడు. ఆమెను అలంకరించాడు. ఆటలు నేర్పాడు. పాటలు నేర్పాడు. చుట్టూ పెద్ద గట్టువేయించి తోట తయారుచేశాడు. తూర్పుగట్టుమీద తాటాకు పాక వేసుకుని పొలంలోనే మకాంపెట్టాడు.

## 3

పచ్చలయ్య అనవసరంగా ఎవ్వరితోనూ మాటలాడే వాడుకాడు. తన రెండెకరాలు వ్యవసాయమూ లేనప్పుడు తన పొలంగట్లమీద కలకలలాడుతూ అవతరించిన తోటకి సేవ

చేయడం, కష్టాలల్లో ఉన్న బీదరైతులకు కానో కాసో రహస్యంగా సాయంచేయడం ఇదే అతని జీవితమార్గం.

పచ్చగాఉన్న పచ్చలయ్యమాట అందరికీ పథ్యం కాసాగింది. రెండెకరాలకు నలభై బస్తాలు పండుతాయి. అమ్మితే కరువురోజులలోకూడా అతనికి రెండువందలు వస్తాయి ఎద్దుల మేతకు, తనభోజనానికి సంవత్సరానికి రెండువందల నలభై కర్చు అవుతున్నది.

పళ్ళకూ, కూరగాయలకు కొబ్బరికాయలకు, గట్టుల వేసే మినుములకూ కందులకూ పాలుకు రెండువందలు వస్తున్నవి. ఆకుమళ్ళకు నూరు రూపాయ లాదాయం వస్తుంది. కర్చులు వ్యవసాయానికంతకూ యాభై అవుతుంది. లెక్కలన్నీ చూసుకుంటే పన్నులు, మామూళ్ళు, మళ్ళీ తిరిగిరాని చేబదుళ్ళూ, వారికీ వీరికి సహాయాలూ అన్నీపోతే అతనికి సాలుకు నూరు, నూటయాభై రూపాయలు మిగుల్తున్నాయి. ఈ పదేళ్ళలో తన పొలంలోరూపాయి కాసులుగా మార్చుకొని, ఎక్కడ దాస్తాడో పచ్చలయ్యకు పన్నెండు వందల రూపాయలు పోగయ్యాయి.

## 4

పచ్చలయ్యకు అరవైఏడో ఈడు వచ్చింది. అతనిది విజయనగరం పక్కగ్రామం. ఆరోగ్యం ఎప్పుడూ చెదరదు. కాని పచ్చలయ్యకి ఆవేదన ఎక్కువైంది. తన కూతురు "పొలం లచ్చిమి" పెద్దదయింది. ఈడు వచ్చింది. ఈ అమ్మాయిని ఎవరికిచ్చి పెళ్ళిచేసేది. మంచి సంపాదనపరురాలు.

ఇవాళ కాకపోతే తన తదనంతరమన్నా ఎవరో అమ్మాయిని పెళ్ళి చేసుకోవలసినవారే!

తానూ పెద్దవాడవుతున్నాడు. విశాఖపట్నంచీమ వాడు అతనితాత. అతనిచుట్టాలు ఉండీగ్రామంలో చాలా మంది ఉన్నారు. ముఖ్యంగా తనఅక్క అప్పలమ్మ తన మేనల్లుడు సోమన్న ఉన్నారు. తనఅక్క మొగుడుపోయిన వెనక కరణంగారి ఇంట్లో పనిచేసుకుంటోంది. మేనల్లుడు పెద్దకాపు సుబ్బన్ననాయుడుగారికి పాలేరు. కాని ఆ కుఱ్ఱకుంక ఇరవై అయిదేళ్ళొచ్చి పెళ్ళానొన్నదిలేసి, ఉండికాల్వ వంతెన పక్క కొత్తగా పెట్టిన హోటలులో ఓ అమ్మాయిని మరిగాడు.

అలాంటి ఎదవకు తన కన్నతల్లిని తన బంగారు బొమ్మను "లచ్చిమిని"ని ఇస్తే దాన్ని గంగలో కలిపేస్తాడుకదా, అనుకున్నాడు.

ఆ వేసవిరాత్రి బీరపాదులు పెట్టిన తన పొలంలోకివెళ్ళి ఓ గట్టుమీద కూర్చున్నాడు.

"ఓలమ్మో లచ్చిమీ! ఏటంతవు? నిన్నింతదాన్ని చేసి పెంచుకొన్నా. నీకు పెళ్ళిసేయకపోతే ఏటనుకుంటుంది లోకం?"

కంట్లో ఆ పొలంకన్నె పధ్నాలుగేండ్ల బాలికలా వచ్చి కట్టయింది అతనికి. ఆ అమ్మాయివచ్చి అతనిపక్క కూచుంది.

లచ్చిమి :—ఓరయ్యా, నేనేటనేది. నాకిప్పుడేటిపెళ్ళి! ఊరనన్నా నవ్విపోతరు. అందులో ఓయిబాబూ! ఏపందిగా తన్నా నా. మొగుడైతే నాతిప్పంలా సింహాదిరప్పన్నకూడ సయించలేనంత అయిపోతది బాబూ!

పచ్చలయ్య :—నాకన్నతల్లివి గావంటో?

లచ్చి :—అయ్యా! మంచిమొగుణ్ని నానే ఏరుకుం తాను గాదేంటి?

పచ్చలయ్య :—ఎప్పుడేరుకుంతవులమ్మి!

లచ్చిమి :—బాబూ! నీకెందు కంతగోడవ. నానే సెపుతాను గాదంట్రా!

పచ్చలయ్య :—నా నెల్లి తొంగుంటాలమ్మి.

లచ్చిమి :— బాబూ, నువ్వు తొంగో, నేను సూత్తో ఉంటానులే.

ఈ సంభాషణ అతనికి ఏమాత్రమూ అనుమానం లేని నిజం. పచ్చలయ్య సంతోషంతో వచ్చి నిద పోయాడు.

లచ్చిమి ఆ వెన్నెట్లో అలా పవ్వళించి కన్నుమూసింది.

## 5

ఆ మర్నాడు పచ్చలయ్యమేనల్లుడు సోమన్నభార్య పైడమ్మ పచ్చలయ్య దగ్గరకు వచ్చింది.

పైడమ్మ:- బాబూ, నీ అల్లుడి యిసయం అంతకన్న ఎక్కువౌతోంది బాబూ! నిన్న కేతిరి తాగి ఇంటికాడ కొచ్చి నాడు. ఇంటికాడ మా అత్తతో దెబ్బలాట వేసుకున్నాడు. ఆపళంగా కోపంతో వచ్చి, నన్ను సావగొట్టి తూలి పడిపోయి, ఈత దుమ్ములోనాగు గుజ్జటి నిదరోయాడు బాబూ, నువ్వలప్పు ఆడిని మంచిదారిలోకి ఇకేరు పెడతారు చెప్పూ!

పచ్చలయ్య:- పైడమ్మా! నీవన్నదంతా సత్తెమే!

నానుమాత్ర మేటిచేసేది తల్లీ! బగవంతుడు రచ్చించాల. నువెళ్ళి ఏ అమ్మవారికో దణ్నాలెట్టుకుంటూ ఉం డంతే!

పైడమ్మ:—బాబూ, నన్ను సంపెత్తడు నీ అల్లుడు. నాను బయమేత్తదయ్యా! నిన్నరేతిరి పెద్ద కత్తుచ్చుకొని, 'లంజా పతివోడి పక్కనోకి యెడతావున్నావా. నిన్ను సంపేసి నాను సంపేస్కుంతరు' అని ఆ కమ్మకత్తి నాక్కాని నాకాడి కొచ్చాడు. యేటె సేమునుంతవు వచ్చలాయిబాబూ?

పైడమ్మ కళ్ళ మహానదులు ప్రవహిస్తుండగా కుళ్ళి పోయింది. పచ్చలయ్యను సటుక్కున తన లచ్చిమిని సలహా అడిగితే, ఆమె సరియైనమార్గం చెప్పాలి. తన కా ఆలోచన తట్టింది. తిన్నగా పొలంలోకి ఒక్కడూ పోయాడు. ఆ పచ్చని పొలం 'ఏటిబాబూ, ఆడికి నానే బుద్దిసెపుతాగాదా!" అని జవాబిచ్చినట్లయింది. తిన్నగా తన పాకలోకొచ్చి "పైడీ! ఎల్లి మా అక్కను నాను రమ్మంతున్నానని తీసుకురావే! మా అక్క, నువ్వూ ఇక్కడే నాలుగురోజులపాటు ఉంటురు గాని" అని ఆమెను పంపించినాడు.

పైడమ్మ వెళ్ళి ఒక గంటలో, తన అత్త అప్పమ్మని తీసుకు చక్కావచ్చింది.

## 6

ఇంటికొచ్చేటప్పటికి పైడమ్మా కనబళ్ళేదు, తల్లి అప్పలమ్మా కనబళ్ళేదు సోమన్నకు! తాగి ఉన్నాడు కళ్ళు ఎర్రిచేసుకొని పక్కదాంట్లో ముసలిదా న్నడిగాడు.

"ఆళ్ళు నీ మామింటికి పొలంపోయారు సోమన్నా" అన్న దా ముసలిది.

"ఏటీ! ఎల్లారూ, ఆ ముసలెదవదగ్గిరికి? ఆణ్ని సంపేసి, నాను సంపేస్కుంతా" అంటూ దుడ్డుకర్రి పుచ్చుకొని మేన మామపొలానికి తన పేటనుంచీ ఎల్లాతూలుతూ, కేక వేసుకొంటూ ఉండీను చీడాడీ అగ్రహార పొలిమేరకు కాలవ గట్టునసే నడుస్తూ వచ్చాడు. రెండు మూడు సారులు పడ్డాడు లేచాడు. మళ్ళీ సాగించాడు.

ఉండీ తూరుపుకాపుల గూడెంలో సోమన్న మామని చంపేస్తాడేమోనని అల్లరి బయలుదేరి పెద్దలూ పిన్నలూ కర్రలుపుచ్చుకొని పచ్చలయ్యపొలానికి నడక సాగించారు. గజం చుట్టలు వెలిగించారు. కుర్రవాళ్ళు బీడీలు వెలిగించారు. జట్కాతోలే రామన్న సిగరెట్టు వెలిగించాడు.

వాళ్ళంతా పచ్చలయ్యపొలందగ్గరకువచ్చి కాల్వలో దిగి దాటి అవతలగట్టునేఉన్న పచ్చలయ్య పొలంగట్టుమీదకు వెళ్ళి "పచ్చలయ్యా" అని పిలిచారు. అదివరకే వాళ్ళందరూ వచ్చే ఈవతలిగట్టునుంచే "పచ్చలయ్యో" అని వాళ్లు కేక వేశారు.

వాళ్ళందరూ తన పాకున్నపొలంగట్టుమీదకు రాగానే, పచ్చలయ్య నిద్రలేచి "ఏటిరాఅది! అల్లాగా కేకలెడుతున్నా" రని అంటూ పైకివచ్చాడు. పైడమ్మ, అప్పలమ్మ పైకివచ్చారు.

ఒకడు:—సోములు ఇక్కడకు రాలేదురా మావా?

పచ్చలయ్య:—రాలేదురా! ఆ డేమయ్యాడేంటి?

ఇంకొకడు:—ఏమో సిన్ను సంపేత్తనని ఇక్కడకు బయలుదేరినాడంట

పచ్చలయ్య:—ఏమైఉంటాడు. మీకు దారిలో కాపడ లేదంటారా?

మొదటివాడు:—అబ్బే!

ఇంతట్లో పైడమ్మ హారికేన్ దీపము వెలిగించి తీసుకొనివచ్చింది. అందరూ సోమన్నను వెదకటానికి బయలుదేరి ఒకవేళ వంతెన దగ్గిర ఆవలి ఒడ్డుకు దాటివస్తూ, తాగి ఉన్నాడు గనుక దారిలో పడిపోయి ఉండవచ్చునేమో యని ఆలోచించారు. దీపం పట్టుకొని ఒకడు ముందు నడిచాడు, తర్వాత అందరూ బయలుదేరారు.

నాలుగు అడుగులు వేయగానే, వెనకవచ్చే ఒకపడుచువానికి పచ్చలయ్యపొలంలో ఏదో తెల్లగా పడిఉన్నట్లు కనబడింది. "అదేదో సూసొత్తాను." అని లాంతరుపుచ్చుకొని పొలంలోకిదిగి, ఆ వస్తువుదగ్గిరకివెళ్ళి చూసీ చూడడంతోనే "ఒరి రండల్లో, ఇక్కడ పడున్నాడు సోమన్నగాడో" అని కేకేశాడు. అందరూ పొలంలోకి పరుగెత్తారు.

ఆ పొలంలో ఒళ్లు తెలియకుండా, సోమన్న పడి ఉన్నాడు.

పచ్చలయ్య వంగి సోమన్నగుండెలో చేయిపెట్టి చూచాడు. గుండె దడ దడ కొట్టుకుంటోంది.

"ఈడికీ మత్తుతప్ప మరేం జబ్బు లేద్రా" అన్నాడు. ఇద్దరు సోమన్నను పైకెత్తి పొలంలోంచి పచ్చలయ్యపూరింటి దగ్గిరకు తీసుకునివచ్చారు.

పచ్చు:—ఆణ్ణి అల్లా తొంగోబెట్టి మీా రెల్లండ్రా! మీాకు నా దండాలు.

మొదటి:—ఈ కుంకన్నగాడికీ మెలకువవత్తే, అల్లరి చేత్తాడేమో పచ్చులాయి!

పచ్చు:—మెలకువ తెల్లారిందనకా వస్తుందా? వచ్చా నాగనోణ్ణి ఈణ్ణాంటి పదిమందిని మడతలేసి సితకమొడి సెయ్యగల్ను.

రెండవ:—ఓరి యెంకటసామి, పచ్చులయ్య మొన్న కాలవనో మెరకట్టిన పన్నెండుటన్నుల నావను తలకాడెత్తి, ఎనక్కునెట్టినసంగతి యెరగవేంటూ?

వారంతరు కొంచెంసేపు ఆ కబుర్లు ఈ కబుర్లు సెప్పు కొని, పచ్చులయ్యా అప్పలమ్మలదగ్గిర సెలవు పుచ్చుకొని తమ పేటకు వెళ్ళిపోయినారు.

## 7

తెల్లారిన రెండుగంటలకు సోమన్న లేచినాడు. తా నెక్కడవున్నదీ సోమన్నకు తెలియలేదు. చేతులతో తల పట్టుకొని "నా ఎదవమతి! ఎక్కడున్నానేంటి?" అనుకున్నాడు. అతనికళ్లు తిరిగి మూతలుపడిపోయినాయి. కాని ఒక్కసారిగా అతనికి పూర్తిగా మెలకువవచ్చింది.

తాగిఉన్న అంతమత్తులోనూ, రాత్రి జరిగిన ఒక సంఘటన గుండెనుగుద్ది చెప్పినట్లుగా జ్ఞాపకంవచ్చింది. తాను తనమామపొలందగ్గిరకు వచ్చాడు గట్టుతప్పి పొలంలోకి

వెళ్లాడు. అప్పుడెల్లా వచ్చిందో నీళ్ళల్లో పడినట్లే మెలకువ వచ్చింది. ఈ పొలం రాత్రి ఎంత అందంగా కనబడింది. "ఆ కాఫీహోటలులుపిల్ల దొంగనాఁనంజ నా నెల్లేసరికి, ఆడెవడి పక్కనో దొంగునుంది. ఓలబ్బో, మాచెడ్డ కోపమొచ్చేసి అళ్ళిద్దరినీ సంపేసేద్దామని మీఁదపడేటప్పటికి, ఆకొత్తోడు నెగిసి సాపకొట్టి, యిడిసిపెట్టాడు. ఈడిపొఁగరు ఇల్లాఉందిరాఅని, నానెళ్ళి సారాయిదుకాణంకాడ రెండుబుడ్లు లోసేసి,కత్తికోసం ఇంటికెళ్ళాను ఆ తరవాత నాకేం తెలుసు. మామపొలంలో ఉన్నానుగందా ఆపైన నాకు చటుక్కున తెలివొచ్చి సూత్తే మామపొలం. అది పొలమేటి, అది బంగారుపిల్ల కాదంటా! ఆ సీకటంతా ఎన్నెలే అయిపోయింది. ఆ పొలం సూత్తే మామత దేవుడాంటివాఁడో గాపకంవచ్చి, మా దుక్కమేసి పొలంలో పడిపోయి యేడిసినానుగందా. ఆ తర్వాత నాకు నిదరే పట్టేసింది." అని తనచుట్టూచేరిన పచ్చలయ్యతో, పైడమ్మతో అప్పలమ్మతో సోమన్న సిగ్గుపడుతూచెప్పాడు.

సోమన్న :—మావాఁ! ఏటి సేయమంతవు, రాత్రి నీ పొలంలో కాలెట్టినా. అంత దుక్కమొచ్చిందేమిటి?

అప్పలమ్మ:— ఓరి కుంకన్నా, మామపొలంలో కడుపు గట్టడానికి నీకేమి అక్కుందిరా?

పచ్చలయ్య :—నీ కిట్టమొత్తే నా పొలంగట్టుమీఁద నీ బారియతోనుండు. యేశే సిన్నిల్లేసుకుందాం. నానూ, మా అకా మా ఇంటిలో ఉంటాం.

అప్పలమ్మ :—రోజూ తాగొచ్చి, పుత్తెగట్టిన పుత్తడి బొమ్మంటి పిల్లదాన్ని కొట్టే చచ్చుకుంకవి ఇక్కడ కాపుర మేటిరా తమ్ముడూ.

పచ్చలయ్య :— నా లచ్చిమి ఈడు తాగొత్తే ఇక్కడకు రానివ్వనందనే నీ ఉద్దేశం ?

పైడమ్మ:- బాబూ, నీకింత సాకిరిచేసుకుంటూ పడుం టాను. ఆడు నన్ను చంపేత్తాడని భయంకాదు. ఆ తాగొచ్చి నప్పుడా డనేటి మాటలు- రామసెందా! పాపం వొరుసం కురుత్తాదికందా !

# 8

సోమన్న సిగ్గుపడి లేచి ఆ పొలం మాలక్ష్మిలోనికి నడిచి పోయాడు. అక్కడ ఒక మడిగట్టుమీద కూర్చుండి, ఏదో ఆలోచనలోపడినాడు.

తనమామ ఈపొలానికి లచ్చిమి అని పేరెట్టుకున్నాడు. ఎంత సక్కని, ఎంత సక్కని పొలం! తన మామ పచ్చలయ్య దేముడంటివోడు. ఎన్నిసార్లు తనకూ తన కుటుంబానికి సాయం రాలేదు. అంత ముసలోడు ఆ పనేంటి ఆ సగితేంటి ?

లచ్చిమీదేవే ఈ పొలం. తాను ఈ లచ్చిమీదేవి దగ్గిర నుంచోడాన్కైనా తగడుకందా ! ఈ పొలంలచ్చిమిని కావులించుకోవాలి. తన మావ తన కూతురంటా డీ పొలాన్ని. తనపైడి నిజంగా పైడిబొమ్మ! ఎన్నిమార్లు తాను దాన్ని

ఏడిపించలేదు. ఉలక్కుండా మలక్కుండా ఎంత పగిలితో తనకూ, తనమ్మకు శాకిరి సేత్తుందికాదు. ఆ దిగదుడిచిన ఓటలు సరుకు తన పైడికి మైలుదూరంలో నుంచోడానికి వొల్లా? ఆ సచ్చు సరుకులు ఈ పొలంలచ్చిమికి రావడానికి వొల్లా!

ఏటి తన కీ పోగాలం. ఎదవ తాగుడు. మా అయ్య ఎప్పుడైనా తాగినాడా. సంపాయించిన ఎకరా పొలం నేను మునసబుగారి కమ్మేసినానుగందా! తల్లీ, పొలం మాలచ్చిమీ అంటేన నన్ను రచ్చిత్తాది. లేకుంటే నాకూ దానికి ఏమి సమ్మందం.

"పెళ్ళాంమెళ్లోగుల్లలు తాగురమ్మగోరి వొళ్ళో ఏసేసినాను."

"పొలం లచ్చిమీ! కుక్కబతుకు బతికినాను. నన్ను రచ్చించాలి."

ఆ పొలంబాలిక నవ్వినట్లయింది సోమన్నకు. ఆపొలంలో సాగిలపడ్డాడు సోమన్న. అతని కళ్ళవెంట ఉండి కాల్వాలు నూరు ప్రవహించాయి. పొలంలచ్చిమి చిరునవ్వు నవ్వి 'లే సోమన్నా! నన్నూ పైడమ్మను ఆపేచ్చతో సూత్తానని మాటిచ్చియ్యి. మాట తప్పావా! నువ్వు నాశనమైపోతవు. నా శకితి అలాటిది. మామమాట తప్పక బుద్ధితో మసలు, నేనూ పైడమ్మా నీ కిద్దరం పెళ్ళాలను' అని పలికినట్లు అతని హృదయానకు తట్టింది.